నియమ నిర్వాహణము

కాళ్ళూరి వేంకటరామారావుగారు

౧

ట్రంకురోడ్డుమీదనుంచి ఏజన్సీప్రాంతములకు పోయే మోటారుబస్సుల ఘర్ఘరధ్వనులుతప్ప తన నిశ్శబ్దవాతావరణమున కేయంతరాయమునూ ఎరగని సాంద్రారణ్యప్రదేశ మది. సృష్ట్యాది నుండీ తా ననుభవిస్తూవున్న ప్రశాంతజీవనమును విధ్వంసమొనర్చే మోటారుబస్సుల అరపుల నేమాత్రమూ సహింపక నాలుగుమూలల నించీ భయంకరప్రతిధ్వనులతో హుంకరిస్తూ వుంటాయి, అక్కడి పర్వతశ్రేణులు. అలసటఅన్నమాటే తెలియకుండా శరవేగంతో పరుగెత్తే యీపాశ్చాత్యయంత్రవాహనములవేపు ఆశ్చర్యంతో చూస్తూ వుంటా రక్కడి కోయదొరలు. నైజాముప్రభుత్వోద్యోగులు విహారార్థము బయలుదేరినప్పుడుతప్ప అక్కడ గోదావరిలో పడవలు నడిచిన సమయమే లేదు.

'దుమ్ముగూడెం' అటువంటి స్థలంలో నదీతీరాన్ని కట్టబడినది. హైదరాబాదుప్రభుత్వము అక్కడే గోదావరికి అడ్డుగా ఆనకట్టను నిర్మించినది. ఆనకట్టకి పూర్వం జనసంచారమే యెరగని దుర్గమారణ్యమును కొంతబయలుచేసి 'ఆనకట్ట ఆఫీసు'ను, ఉద్యోగస్థులకీ, సిబ్బందికీ కావలసిన గృహనిర్మాణమును జరిగింది. ఈయిళ్లే 'దుమ్ముగూడెం' అనేగ్రామానికి పునాదులైనవి.

గ్రామం పెరిగినతరవాత ఆనకట్టఉద్యోగస్థు లుండే యిళ్లకు మాత్రము 'లైను' (Line) అనే వాడుకనామం కలిగింది. ఆఫీసర్ల లైనుకీ అసలుగ్రామానికీ మధ్య ఒకఫర్లాంగుదూరంకూడా ఉండదు. వ్యవహారసౌకర్యార్థం ఈగ్రామాన్ని 'గూడెం' అని పిలవడమే మామూలైపోయింది.

లైనులో చాలవరకు ప్రభుత్వనిర్మితములైన సుందరభవనములే ఉన్నాయి. కంట్రాక్టర్లవీ, ప్రత్యేకవ్యక్తులవీ ప్రైవేటుబంగాళాలు నాలుగైదుమాత్రం విడిగా అక్కడే ఉన్నాయి. లైనంతా పరిశుభ్రములైన రెండువీథులతో ముద్దొస్తూవుంటుంది. ఊరుదాటితే అంతా భయంకరకాననమే.

సాయంకాలం ఆరుగంటలు దాటిపోయింది. పట్టపగలే భయము గొల్పే అడవి అంతటా చిమ్మచీకట్లు కమ్ముకున్నవి. జారిపోయి నల్లనైపోయిన సంజ కభిముఖములై నిలిచి విశాలవృక్షములు మహాభూతములలాగు తలలువిరియబోసుకుని గాలికి తూగాడుతున్నాయి. పక్షులన్నీ గూళ్లకి చేరిపోయి చాలాసేపయింది. క్రూరమృగము లింకా తమ నిశాసంచారమును ప్రారంభించలేదు. నిబిడములైన చెట్ల సందులలోనుండి ఉద్యోగస్థుల లైనులోని దీపాలు దూరానికి మినుకుమినుకుమంటున్నాయి.

లైనులో మొట్టమొదటిదే యింజనీరు వైద్యనాథయ్యగారియిల్లు. ఇంటిముందు వలయాకారంగా పూలతోట వుంది. నూతనంగా వేయబడిన దవడంచేత చెట్లింకా దట్టంగా అల్లుకొని పెరగలేదు. ఆవరణకి చుట్టూ ఇనపముళ్ల తీగెలకంచె చుట్టబడి ఉంది.

వీథి వసారాలో పరిశుభ్రమైన హరికేన్లాంతరు వెలుగుతూంది. ఇంటిచూరుకి వేలాడుతూవున్న చూపుచాపలన్నీ పైకి చుట్టివేయబడిఉన్నవి. వసారాలో ఒక పెద్దడ్రాయరూ, నాలుగైదు కుర్చీలూ ఉన్నాయి. లాంతరువెలుగు ఇంటిముందున్న పూలతోటలో కొంతభాగముపైమాత్రము పడుతూంది. దీపంవెలుగు పడకుండా వున్నస్థలంలో ఇంటిగోడకి దగ్గరగా ఇద్దరు బంట్రోతులు కూర్చుని మెల్లగా లోకాభిరామాయణం చెప్పుకుంటున్నారు. వాళ్లకి సమీపంలోనే పెంపుడుకుక్క ముట్టె నేలమీద మోపి పడుకునిఉంది.

ఇంతలో ఇంట్లోనుంచి ఒకయువతి వసారాలోకి వచ్చి గోడకి చేరబడి ఆవరణ కావలనున్న అరణ్యంవేపు చూస్తూ నిలబడింది. ఆమె రాకను గ్రహించి బంట్రోతులు తమ కంఠముల నింకా తగ్గించుకుని మాట్లాడుకుంటున్నారు. పెంపుడుకుక్క పరుగెత్తుకుపోయి ఆమె చీరచెరగును తాకుతూ సస్నేహంగా నిలుచుంది.

ఇరవై సంవత్సరాలైనా నిండని ఆమెశరీరము చామనచాయ గలిగి బహుకోమలమై ఉంది. కాంతివంతమై, కళాభరితమైన ముఖం ఆకర్షణీయమై ఉంది. లాంతరువెలుగునం దామెనేత్రములు ఖిల

మిల మెరుస్తున్నాయి. విలువగల దక్షిణాదిచీర నామె ధరించింది. చుట్టూ లేసుపని చేసిన సులాకీరైక తొడుగుకుంది. వివిధరకముల పనితనము కల బంగారపు గొలుసులు రెండుమాత్ర మామెకంఠసీమ నలంకరించి ఉన్నాయి. నడుమున ఉన్న వడ్డాణము దీపపు కాంతిలో జిగజిగ మెరుస్తూంది. పరిపూర్ణమైన అంగసౌష్ఠవము కలిగి ఆమె సౌందర్యం దర్శనీయమై ఉండెను.

"ఇంతలో ఇంట్లోనుంచి ఒకయువతి......చూస్తూ నిలబడింది"

అయిదు నిముషాలసేపు అల్లా నిల్చుని ఆమె బంట్రోతులవేపు చూసి "ఖాసిం! అయ్యగా రింకా రాలేదేం?" అని అడిగింది.

ఖాసిం తొందరతొందరగా లేచి సవినయంగా "వారూ, ఓవర్సీరుగారూ షికారు వెళ్లారండి. ఈపాటికి వొస్తూఉంటారు." అని చెప్పాడు.

ఆసమాధానమును విని "ఎంతచెప్పినా యింతే. ఈఅడవుల్లోనూ, అఘాంత్రాల్లోనూ ఈపాటికి ఇంటికి చేరగూడదూ?" అని నింపాదిగా అనుకుంటూ యింట్లోకి పోయింది.

"అయ్యగా రొచ్చేవరకూ యీావిడకి మాచెడ్డ ఖంగారురా! ఈపావుగంటలోనూ నాలుగుమార్లయినా ఆయన వచ్చారో లేదో అని మనలను కనుక్కుంది, చూశావా?" అని ఖాసిమ్ తనతోడి ఉద్యోగితో అన్నాడు.

"ఏవేళ కింటి కెళ్లినా మనవాళ్లకి మన గొడవే అక్కర్లేదు. ఎప్పుడొచ్చామో, ఎక్కడ సచ్చామో అన్నవూసే మన ఆడవాళ్లకవసరంలేదు. అల్లాంటి భార్యకంటే అదృష్టం వేరే ఉందా?" అని జవాబిచ్చి ఖాదరు నిట్టూర్పువిడిచాడు.

మరి పదినిముషాల కామె మళ్లా వసారాలోకి వచ్చి "ఏమోయ్, ఖాదరు! కొంచెం అల్లా వెళ్లి చూసిరా. ఎందుచేత ఇంకా రాలేదో. ఎప్పుడూ ఇంత ఆలస్యం చెయ్యలేదు" అని ఆజ్ఞాపించింది.

ఖాదరు వెళ్లుతూఉన్నవేపు దీక్షగా చూస్తూ ఆయువతి అలాగే నిలబడిఉంది. బంట్రోతు పూర్తిగా ఆవరణగేటు దాటకముందే పైని చీకటిలోనుంచి మనుష్యుల అలికిడి వినబడింది. ఇంతలోనే గేటుదగ్గర "గుడ్ నైట్ సర్!" అనియును, తిరిగి జవాబుగా "యస్, గుడ్ నైట్" అనియును మాటలు వినబడ్డాయి. ఆమాటల వెంబడినే వైద్యనాథయ్యరు లోపల ప్రవేశించాడు.

వైద్యనాథయ్యరువయస్సు ఇరవైయెనిమిది సంవత్సరాలకు మించి ఉండదు. రమారమి ఆరడుగులయెత్తు మనిషి. బలిష్ఠమై సుందరమైన అవయవనిర్మాణము. ఔదార్యమునూ, ప్రసన్నతనూ ప్రదర్శిస్తూన్న ముఖమూ, అపారమగు తెలివితేటల నీను కళ్లూఉండి అయ్యరునందు స్నేహపాత్రుడైన వ్యక్తిని స్పష్టీకరిస్తున్నాయి.

వైద్యనాథయ్యరు నైజాముప్రభుత్వమున ఇంజనీరుగా ప్రవేశించి మూడేళ్లుమాత్ర మయింది. ఈస్వల్పకాలంలోనే ఉద్యోగధర్మనిర్వహణమునం దతడు అసాధారణకౌశల్యమును కనబరిచాడు.

అతని భార్య గొప్పవారింటి బిడ్డ. ఆమెతండ్రి పశ్చిమతీరమున ఒకజమీందారీకి దివానుపని చేసి కీర్తివహించిన రాజకార్యనిపుణుడు. వైద్యనాథుని దేమంత ధనవంతమైన కుటుంబము కాకపోయినా, పాఠశాలయం దతని ప్రజ్ఞాతిశయాన్నిబట్టి దివానుగారి అల్లుడైపోయాడు. వారి వివాహము స్వయంవరంలాంటిది. చెన్నపట్నంలో ఇంజనీరింగుచదివేటప్పుడే వైద్యనాథుడు దివానుగారి అమ్మాయిని చూశాడు. అప్పటి అనురాగలతయే చిగిర్చి కొనలువారి పుష్పించింది.

ఉద్యోగంలో ప్రవేశించిన తత్క్షణం వైద్యనాథయ్యరు సుందరమ్మాళ్‌ని వివాహంచేసుకున్నాడు. వివాహమైనదిమొదలు వారిద్దరూ ఏకొద్దికాలమోతప్ప ఒకరినొకరు సాధారణంగా విడిచిపెట్టి ఉండలేదు.

ఆరోజుల్లో హిందూదేశపు విశ్వవిద్యాలయములలో ఇంగ్లీషు చదువుకొన్నవారికి నైజాంప్రభుత్వమునందు గొప్ప ఉద్యోగాలు సులభంగా లభించేవి. అందుచేతనే వైద్యనాథయ్యరు హైదరాబాదు ప్రభుత్వంలోనే ప్రవేశించాడు. అనుకున్నట్లుగానే అతనికి శీఘ్రకాలములోనే వేతనాభివృద్ధియు, ఉద్యోగాభివృద్ధియు కూడా కలిగాయి.

౨

చేతిలోనున్న బెత్తాన్ని తిప్పుకుంటూ వైద్యనాథయ్యరు గబగబ బంగాళాను సమీపించి మెట్లెక్కుతున్నాడు. వసారాలోని దీపపు వెలుతురునందు అతని కళ్ళజోడు ప్రకాశిస్తూంది. మెట్లెక్కుతూనే సహజమందహాసభరితములగు నేత్రములతో భార్యవేపు చూశాడు.

"ఇంకనించి యింటి కింత ఆలస్యంగా వొస్తే వొప్పుకునేది లేదు" అని ప్రేమార్ద్రములగు కోపదృష్టులతో సుందరమ్మాళ్ భర్తను బెదిరించింది.

"అబ్బో! ఇంక ఆలస్యంగా వస్తే అమ్మగారు శిక్షిస్తారు కాబోలు. బాబూ! ఏదిదారి?" అని అతడు భార్యహస్తమును తన చేత్తో పట్టుకున్నాడు.

భర్త చేతులోనుంచి తన చెయ్యిని కొంచెం విడిపించుకోబోయి పూర్తిగా విడిపించుకోకుండానే సుందరమ్మాళ్ "సరీగా నడుచుకోకపోతే మరేం చెయ్యాలి?" అంటూ పొంగుతూ వస్తూన్న నవ్వును అతికష్టంమీద ఆపుచేసుకుంది.

"అలాగా! అయితే లోపలికి రండి, ఏం శిక్ష వేస్తారో నేర్దురుగాని." అని వైద్యనాథుడామెను ఇంట్లోకి తీసుకుపోయి "వెయ్యండి శిక్ష. నేరస్థుడు సిద్ధంగా ఉన్నాడు" అన్నాడు.

సుందరమ్మాళ్ తిరిగీ కొంచెం కోపం నటిస్తూ "మీ కెన్ని మార్లు చెప్పాను, చీకటిపడనిచ్చి ఈ అడవుల్లో బైట తిరగొద్దని, చెప్పండీ! సాయంకాలమైన తర్వాత మీరింట్లో లేకపోతే యీ హృదయం యెల్లా కొట్లాడిపోతుందో మీ కేం తెలుసును? జంతువులూ, పురుగూ, పుట్రా తిరిగేసమయంకదా అని మీ రింటికొచ్చేదాకా నాకు సుఖమే ఉండదు. పోనియ్యండి మీ కెప్పుడూ ఇంతే" అన్నది.

"బయట ఏజంతువులు తిరిగినా నారివాల్వరు ఎప్పుడూ సిద్ధంగానే ఉంటుందనీ, ఏపరవా లేదనీ చెప్పలేదూ నీకు? పైగా యీ సమీపంలో మనుష్యులకి హానిచేసేటంత ప్రమాదకరములైన జంతువులు లేవు. ఈమాత్రందానికి నీ కింత భయమెందుకు సుందరం?"

"భయమెందుకా? నేనప్పుడప్పుడు స్నానానికి గోదావరి కెళితే అన్ని జాగ్రత్తలు చెబతా రెందుకూ మీరు? నేనేం చంటిపిల్లననా, ఆమాత్రం జాగ్రత్త తెలీదనా? ఆఫీసుపనికూడా మానుకుని నేను స్నానంచెయ్యడం అయేదాకా అల్లా నదివొడ్డున తిరగడం మీ కెందుకు చెప్పండీ?"

సుందరమ్మాళ్‌ని దగ్గరగా తీసుకుని వేళ్ల కొనలతో ఆమె చెక్కులపై మృదువుగా నొక్కుతూ వైద్యనాథుడు "సరేలే. ఈసారి క్షమించు. ఇంకనుంచి సాయంకాలం ఆరుగంటలయేసరికి హాజరు" అన్నాడు.

*   *   *   *

ఒకనాటి రాత్రి తొమ్మిదిగంటలైపోయింది. లైనులోనివారందరూ ఇళ్ల తలుపులు బిగించుకుని నిద్రాధీనులై ఉన్నారు. అంతటా గభీరనిశ్శబ్ద మలముకొన్నది. అరణ్యప్రాంతమంతా గాఢాంధకారభరితమైపోయింది

దక్షిణపువేపు గదిలో మంచంమీద వైద్యనాథయ్యరు పడుకొనిఉన్నాడు. పక్కనే సుందరమ్మాళ్ భర్తశరీరానికి చేరబడి విశ్రాంతిగా కూర్చుంది స్వచ్ఛమైన లాంతరువెలుగులో గది శోభాయమానంగా ప్రకాశిస్తూంది. రెండుమూడు పేముకుర్చీలూ, సుగంధ ద్రవ్యము లమర్చబడిన చిన్న మేజాయునుతప్ప ఆవిశాలమైన గదిలో వేరేసామానులు లేవు వైద్యనాథుడు కళాశాలలో చదువుకున్ననాటి ఫోటోగ్రాఫులు నాలుగూ, వివాహమప్పుడు అతనూ, భార్యా కలిశితీయించుకున్న ఫోటో ఒకటే, రెండుమూడు Land scape చిత్రములూ తెల్లనిగోడలపైని అక్కడక్కడ తగిలించబడిఉన్నాయి.

భార్యాభర్త లిద్దరూ నింపాదిగా కబుర్లుచెప్పుకుంటూ తాంబూలమువేసుకుంటున్నారు. సుదీర్ఘమైన భార్యజడను ఎడమచేత్తో పట్టుకుని వైద్యనాథుడు విలాసంగా ఆడకుంటున్నాడు. తమలపాకులను ఒకప్పుడు తననోట్లో వేయడంలోనూ, వేరొకప్పుడు భార్యముఖి పండ్ల కందించడంలోనూ అతని కుడిచెయ్యి నిమగ్నమైఉన్నది. ఇంచుక చెదిరి ధవళకాంతుల నీను ముఖబింబముపై బడి వింత అందాన్ని సమకూర్చిన భార్యముంగురుల సోయగాన్ని తదేకదృష్టులతో చూస్తున్నాయి, అతని కళ్లు.

ప్రధానవిషయమేదీ నిర్ణయంగా లేకపోయినా వారి సంభాషణమాత్రం ఏఅభ్యంతరమూ లేక సుఖంగానే సాగిపోతూంది. ఇంజనీరింగుకళాశాలలో చదువుకున్నప్పుడు సుందరమ్మాళ్‌ని మొదటిసారి చూసినరోజూ, క్రమంగా వారి స్నేహభావములు వృద్ధిపొందిన విషయమూ ప్రతిరోజూ చెప్పుకున్నా వారికి మళ్లీ నూతనంగానే కనిపించి విసుగుకలిగించేవి కాదు. ప్రతిదినమూ ఏదోఒక సమయంలో ఆప్రస్తావన రాకుండా ఉండేదికాదు.

ఉద్యోగంలో ప్రవేశించినకొత్తలో వారు సికందరాబాదులో ఉండేవారు. అక్కడవారికి వినోదమును సమకూర్చే విషయాలు అనేకములుగా ఉండేవి. నాటకాలూ, సినీమాలూ, టీపార్టీలూ, సభలూ మొదలైన వెన్నో వారి కానందమును ప్రసాదించేవి. కాని దుమ్ముగూడెంఆఫీసుకి వచ్చినప్పటినుంచీ అల్లాంటి వేవీ లేకుండా పోయాయి.

ఆ అడవిలో వారు సాధారణంగా ఒకరినొకరు విడిచి ఒకగడియైనా ఉండలేకపోయేవారు. ఉద్యోగపు పనిమీద వైద్యనాథుడు వీథిలోకి పోయేడంటే అతను వచ్చేగడియకోసం నిరీక్షిస్తూ ఏమీ తోచకుండా కూర్చుంటుంది సుందరమ్మాళ్.

దాక్షిణాత్యులలో పూర్వాచారపరాయణత్వ మెక్కువగా ఉంటుంది తరుచు. సంస్కారముదెసకు వారివైఖరి త్వరితగతి సుముఖముకాదు. వైద్యనాథయ్యరుమాత్ర మట్టివారిలో చేరలేదు. కళాభినివేశము కల మనస్సతనిది. వ్యవహారధర్మములనుండి విడివడి తీరిక గలప్పుడల్లా అతడు టాగోరు, షెల్లీ, కీట్సు మొదలైన కవీంద్రుల వ్రాతలను చదివి వాటి అంతరార్థమునుగూర్చి భార్యతో ముచ్చటిస్తూ కాలక్షేపం చేసేవాడు. సుందరమ్మాళ్ కూడా విద్యావతియే అగుటచేత కవిత్వతత్వాన్నిగూర్చి ఆమెతో చర్చించుకోవడ మతనికి ఉత్సాహమునే కలిగించేది.

ఏరోజు కారోజు అతనికి హైదరాబాదునుండి టపా వస్తూవుండేది. టపామనుష్యులచేత కావలసిన పుస్తకాలు తెప్పించుకుని భార్యకి చదువుకోడానికిచ్చేవాడు. మనోహరములైన సాయంకాలములందు ఆమెతో కూడా నదీతీరాని కెళ్లి బండరాళ్ల మీద కూర్చుని ప్రకృతిశోభను విలోకిస్తూఉండేవాడు. ఇల్లాగ దుమ్ముగూడెంఆఫీసుకి వచ్చినప్పటినుంచీ భార్యకి కావలసినంత కాలక్షేపం జరిగేటట్లు చూసేవాడు, వైద్యనాథుడు.

ఆనాటిరాత్రి వారి సంభాషణలో వివిధవిషయాలు దొర్లిపోయాయి. అదంతా దండకారణ్యమనీ, సీతారాముల పవిత్రపాదసంస్పర్శచే పూజనీయమైన స్థలమనీ, ఆ అడవిలో ఉండగానే విధిప్రేరితుడై రావణుడు ఆపురాణదంపతులకు ఎడబాటు కలిగించేడనీ చెప్పి సీతావియోగమును భరించలేక రాము డెంత దుఃఖించాడో కదా అని వైద్యనాథుడు రామాయణకథయందు తన్మయుడైపోయి నిట్టూర్పువిడిచాడు.

భర్త చెబుతూఉన్న ఘట్టము నూతనవివాహితులైన సీతారాముల వియోగమునుగూర్చిన దగుటచేతను, కరుణారసపూరిత మగుటచేతను సుందరమ్మాళ్ హృదయమును పూర్తిగా ఆకర్షించుకున్నది. భర్తనుండి వేరుచేయబడి సాధ్వీమణియగు సీతామహాదేవి ఎంత కుమిలిపోయినదోకదా అని ఆమె లోలోపలే విచారిస్తూంది. ఆసమయంలోనే భర్త శ్రీరామునియెడల సానుభూతిని కనబరుస్తూ పలికిన వాక్యమును, నిట్టూర్పును ఆమెకు వినబడినవి.

అప్పు డామె "ఎంత స్వార్థపరులండీ మీరు! మీమగవాడైన రాముడివిషయమైయే మీరు విచారించారుకాని ఆజానకీదేవిహృదయ మెంత కొట్టుకుపోయిందో, భర్తను తలచుకుని ఆమె యెంతకన్నీ ముని యేడ్చివేసినదో కొంచెమైనా ఆలోచించారా? చీకటిపడ్డతరవాత మీ రొక్కగడియ ఆలస్యంచేసి ఇంటికి రాకపోతే నామనస్సు ఎంత బాధపడుతుందో మీకేం తెలుసును? అల్లాంటప్పుడు మరి ఆజానకీదేవి ఎల్లా ప్రాణాలు నిలబెట్టుకుందో నేను ఊహించలేను" అన్నది.

"అయ్యో! వెర్రిఅమ్మాయి! నిన్ను ఒకగంట సేపైనా విడిచిపెట్టి ఉంటే ఎంతబాధ కలుగుతుందో నాకు బాగా అనుభవం కాబట్టే ప్రియభార్యావియోగమున దుఃఖితుడైపోయిన శ్రీరామునియందు సానుభూతి చూపించగలిగాను. అంతేకాని స్వార్థపరుడనై కాదు. సీతాదేవి బాధ నాకంటె నీ కెక్కువ బోధపడి ఉండడం సహజం. మళ్లీ ఎన్నటికేనా భర్తను కలుసుకోగలుగుతానుకదా అన్న ఆశతోనే ఆమె జీవించగలిగింది. నా కావిడయందు పరిపూర్ణమైన గౌరవం ఉందిసుమా!"

"సరే. సంతోషమే. కాని పట్టాభిషేకమైనతరవాత గర్భవతియగు సీతాదేవిని అడవిలో దిగబెట్టేసినప్పు డామెగతి ఎంతజాలికరమైనదో ఆలోచించండి. ఆవిడస్థితిలో ఉన్నట్టయితే ఒక నిముషమైనా జీవించేదాన్ని కాననుకుంటాను."

ఈమాటలకి వైద్యనాథయ్యరు చాలా బాధపడ్డాడు. "అబ్బా! సుందరం, ఆవిడ అవస్థ నీ కెందుకు రావాలి? ఆపరిస్థితులు ఊహించుకోవడమే నాకు కష్టంగాఉంది. ఊరుకుందూ" అన్నాడు.

"నేను మాత్రం ఆస్థితి నాకు రావాలని కోరుకుంటున్నానా యేమిటి? ఊరికే అన్నాను. (కొంచెం నవ్వుతూ) కాని ఒక్కటి మాత్రం వినండి. శ్రీరామునిలాగ మీరు నన్ను ఎన్నడూ విడిచిపెట్టకండేం? మిమ్మల్ని వదలిపెట్టిన తక్షణం నా ప్రాణాలు నిలువునా ఎగిరిపోతాయి సుమండీ" అంటూ చేతినుండి జారిపోతూ ఉన్న వస్తువును పట్టుకుంటున్నట్లు ఆఅమాయకురాలు ఆత్రముతో తన హస్తములను భర్తమెడచుట్టూ పెనవేసి హృదయానికి హత్తుకున్నది. ఆవాక్యమును ప్రారంభించినప్పు డున్న మందహాసము పోయి అంతలోనే ఒకవిధమైన దైన్యభావము ఆమెను ఆవహించింది. ఆమెమాటలలో కొంచెం వణుకు చూపట్టింది.

వైద్యనాథు డామెను తనకౌగిటియందు గట్టిగా బిగించుకొని "ఏమిటి సుందరం, ఈవెర్రి? నేనేమిటి? నిన్ను వదలిపెట్టడమేమిటి? ఏమీ లేనిదానికి యీఖంగారేమిటి నీకు? లేనిపోని పిచ్చిభ్రమలు కల్పించుకుని, ఊహించుకుని యిల్లా హడలిపోవడ మెందుకు? అయ్యో పిచ్చిపిల్ల!" అంటూ ఆమెముఖమును తనముఖానికి దగ్గరగా తీసుకుని అనునయవాక్యాలు పలికాడు. ఈనాడు తమ సంభాషణను ఆపుంతను పోనివ్వడం తనదే తప్పనుకున్నాడు.

సుందరమ్మాళ్ కొంచెం సేదదేరి "అబ్బే! ఏమీలేదు. కొంచెం ఖంగారు. మీరు నన్నెందుకు వదిలిపెడతారూ?—"

ఆమె యింకా ముగించకమునుపే గోదావరిలో ఏదో బరువైన వస్తువు పడిపోయినట్లు "దభాలు"న చప్పుడయింది. ఆనిశ్శబ్దనిశాసమయంలో, ఆమహారణ్యంలో, విషాదభావసంభరితమగు సంభాషణ ఫలితంగా ఉద్రిక్తమనస్కయై ఉన్నతరుణమున సుందరమ్మాళ్ ఆ శబ్దమును విని ఉలికిపడింది. ఆమె నిలువునా గడగడ వొణికిపోయింది.



"ఆమె తలను హఠాత్తుగా పైకెత్తి కిటికీలోనుండి గోదావరివేపు చూస్తూ..."

భర్తకౌగిటిలోనుండియే ఆమెతలను హఠాత్తుగా పైకెత్తి కిటికీలో నుండి గోదావరివేపు చూస్తూ "అల్లా వినండి. ఆచప్పు డేమిటోను! ఎవరేనా గోదావరిలో పడిపోలేదుకద?" అని ఖంగారుగా అంది.

నిజం చెప్పవలసివచ్చినపుడు ఆచప్పుడు వైద్యనాథాన్నికూడా హడలకొట్టింది. కాని త్వరలోనే తేరుకుని అతడు "ఇప్పు డందులో పడిపోయేవా రెవ రున్నారు? కొండమీదనుంచి ఏదో పెద్దబండ నీట్లో పడిపోయిఉంటుంది." అన్నాడు.

కాని ఇంతలోనే ఎవరో నీట్లో పడి కొట్టుకుంటూన్నట్లు శబ్దం వినబడింది. "అదుగో చూశారా చప్పుడు వెళ్లండి. ఎవరో పడిపోయారు, వెళ్లండి" అని సుందరం భయసూచకమైన కంఠంతో అన్నది.

అంతటా గాఢాంధకారము. నదిలోనుండిమాత్రము శబ్దము ఎడతెరిపి లేకుండా వస్తూంది. వైద్యనాథముగుండెలు కొట్టుకుంటున్నాయి. రివాల్వరు తీసుకుని అతడు "ఖాసిమ్! ఇల్లా రా. ఏటిమీద ఏదోశబ్దమవుతూంది. చూసివొద్దాం. ఓవర్సీరుగారిని లేపు" అన్నాడు.

ఖాదరు సుందరమ్మాళ్‌కి సహాయంగా ఇంట్లోనే ఉండిపోయాడు. వంటలక్కకూడా లేచి యజమానురాలి పక్కకి వచ్చి నిలబడ్డది. వారందరూ నదివేపు చీకట్లలోకి చూస్తున్నారు.

చేతులో పెద్ద హరికేన్‌లాంతరు పట్టుకుని ఖాసిమ్ ముందు నడుస్తున్నాడు. వైద్యనాథము ఓవర్సియరుతో కలిసి వెనుకనుండి వెళ్లుతున్నాడు.

తీరానికి ఇరవైగజాల దూరంలో ఏవోరెండు జంతువులు హోరాహోరిగా నీట్లో దెబ్బలాడుతున్నాయి. లాంతరువెలుగు సరిగా నాటిమీదికి ఆనకపోవడంచేత అవి యేవో నిర్ణయించలేక పోయారు, వారు. మనుష్యుల సడి చూసి ఆజంతువులు మరిపదిగజాలదూరం నీటిలోపలికి పోయాయి.

వైద్యనాథం రివాల్వరు పేల్చాడు. ఆధ్వని వినగానే ఆరెండుజంతువులూ పోరాటమును మానేసి విడిపోయాయి. చెరి ఒక దారినీ ఈదుకుంటూ అవి ఆవలిగట్టుకు చేరిపోయి చీకట్లలో లీనమైపోయాయి.

3

సంధ్యారుణకాంతులు పర్వత శిఖరాగ్రములను అలంకరిస్తున్నాయి. దినకృత్యములను ముగించుకుని పక్షిజాతులు గృహోన్ముఖములై బారులుకట్టి పోతున్నాయి. శరన్మేఘశకలములు ధవళములై వినిర్మలాంబరవీథిని మందగతిని విహరిస్తున్నాయి. వనలక్ష్మి నిండుయౌవనములో తొణుకులాడుతూంది.

వసారాలో డ్రాయరుముందు కూర్చుని కాగితాలు చూసుకుంటున్నాడు, వైద్యనాథయ్యరు. బంట్రోతు ఖాదరు కొంచెం చాటుగా మల్లెపొదపక్కని కుక్కను దువ్వుతూ కూర్చున్నాడు.

ఇంతలో సుందరమ్మాళ్ ద్వారము నానుకుని నిలబడి "ఇంక చాలించకూడదూ ఆఫీసుపని?" అంది. ఆమెశరీరము సగము ఇంటిలోపలివైపునకు ఉండిపోయి మిగిలిన సగంమాత్రం భర్తకి కనబడుతూంది. తొడుగుకున్న లేతగులాబీరైక ఆమె శరీరకాంతిలో కలిసిపోయింది. తాంబూలరక్తిమ పెదవుల సౌందర్యాన్ని ద్విగుణీకృతం చేసింది. ఉదారంగు బనారసుచీరయొక్క జరీఅంచులు మృదుపాదములపై జీరాడుతున్నాయి. జడలో ఉంచిన గులాబీలు రెండూ మనోహరసౌరభాన్ని వెదజల్లుతున్నాయి. ఉజ్వలమైన నేత్రకాంతులు విద్యుల్లతలవలె వైద్యనాథుని ముగ్ధునొనర్చినవి.

అపూర్వదృశ్యాన్ని చూసినవాడిలాగు అతడు భార్య సౌందర్యాన్ని ఆస్వాదిస్తూ సమస్తమూ మరచిపోయి కూర్చున్నాడు. సుందరమ్మాళ్ అందములో తన్మయుడై పోవడాని కతని కది మొదటిసారికాదు.

"అల్లా చూస్తూ కూర్చుంటారేం? ఈవేళ షికారు రాలేమిటి?"

"ఏం విశేషం? నీఅంతట నువ్వే షికారు రమ్మంటున్నావు?"

"ఉంది. తరవాత మీకే తెలుస్తుంది. వస్తే సరి."

"సరే. రాణీగారి ఆర్డరుకి అడ్డులేదు." అంటూ వైద్యనాథుడు లేచి భార్యతోకూడా గోదావరీతీరానికి షికారువెళ్లాడు.

ఝంఝూమారుతమువలన నానాశ్రమలూ పడి విశ్రాంతిపొందుతూఉన్న మహావృక్షమువలె ఇరుదరులను తాకి మహావేగమున పొర్లిపోయిన గౌతమీనది ప్రశాంతగతిని ప్రవహిస్తూంది. జలము వినీలమై, స్వచ్ఛమై అగాధమై ఉంది.

వరదలచేత పరిశుభ్రంగా కడిగివేయబడిన ఒక చాపరాతిమీద వారిద్దరూ చాలాసేపు మాట్లాడుతూ కూర్చున్నారు. చుట్టూ తెప్పతేలుతూ ఉన్న ప్రకృతిశోభను తనివిదీరా అనుభవించారు. వాతావరణమంతా ఆయువతీయువకుల పవిత్రప్రేమసౌరభముతో నిండిపోయినది.

శరత్కాలనిర్మలాకాశవీథిని వినూత్నకాంతులతో నక్షత్రములు గోచరించాయి. కృత్రిమనాగరకతాకల్పితములైన అనవసరపు మర్యాదల కక్కడ అవసరము లేకపోయింది. రెండుశరీరాలూ ఏకమయేటట్లుగా ఒకరిచేతుల్లో ఒకరు ఇరికిపోయి కూర్చున్నారు, వారిద్దరూను. పవిత్రప్రణయబంధములను చూసి అసహ్యించుకునే ఈర్ష్యాదృష్టులు వెతికినాసరే కనబడని ప్రశాంతప్రదేశ మది. ఏకారణముచేతనైనా సరే ఒకనిముషమైనా ఎడబాటు సహించని వారి ఏకీభావమును గాంచి అక్కడి ప్రకృతిఅంతా సంతోషపులకితమైనది.

పరస్పరప్రేమను వెలిబుచ్చుకుంటూ కొంతసేపు సంభాషించుకున్నారు. తమపాదాల నంటి స్రవించే గభీరజలములవంక కొంతసేపూ, అందులో ప్రతిఫలించే ఆకాశవీథివంక కొంతసేపూ చూస్తూ తమ సంభాషణఫలితములగు మధురభావవీథులవెంబడి విహరించారు కొంతకాలము. చుట్టూ నిశ్శబ్దము. సుఖాలోచననిర్మగ్నములగు వారి ఆకృతులను కమ్ముకొస్తూఉన్న చీకట్లపొరలు ఆక్రమించేశాయి.

అంతవరకూ సౌందర్యాన్ని వెలిగ్రక్కుతూఉన్న పర్వతసీమలు చీకట్లలో భయంకరాకారములను ధరించినవి. భార్యాభర్తలిద్దరూ యింటికి చేరారు.

* * * *

తనకి సుందరమ్మాళ్‌కి దూరపుబంధుత్వ మేదో ఉందని వంటలక్క చెబుతూఉంటుంది. కుమార్తె కాపురాని కొచ్చినప్పుడా మెతోకూడా దివానుగారు వంటలక్కను పంపారు. వంటచేస్తున్నప్పటికీ ఇంట్లో పెద్దదిక్కయి, భార్యాభర్తలిద్దరి గౌరవానికీ పాత్రురాలయి ఆవిడ కుటుంబంలోమనిషిలాగే తిరుగుతూఉంటుంది.

దుస్తులు మార్చుకుని భర్తవంటింట్లోకి రాకముందే పట్టుచీర కట్టుకుని సుందరమ్మాళ్ భోజనానికి సిద్ధంగా ఉంది. ఇద్దరూ ఒకవరసనే సుఖాసీను లైనారు. వారి సంభాషణలో చనువుగా పాల్గొంటూ వంటలక్క వడ్డిస్తూంది.

"సుందరం! ఇందాకా ఏదో విశేషం చెబుతానన్నావు. చెప్పు." అని వైద్యనాథుడు భార్యతో అన్నాడు.

"అప్పటిసంగతి యింకా జ్ఞాపకముందా యేమిటి చెప్పడానికి? అప్పటివిషయం అప్పటిదే" అని సుందరమ్మాళ్ తలవంచుకుని భర్తవేపు చూస్తూ నవ్వుకుంది.

"మరి చూశారుటండీ. సుందరం యెల్లా దగాచేసిందో?" అని వంటలక్కతో వైద్యనాథుడు ఫిర్యాదుచేశాడు.

ఇల్లాంటి కలహాలలో వంటలక్క తీర్పులు ఉభయపార్టీలకీ లాభకరంగానే ఉండేవి.

"నే నేం దగాచేశాను? చెప్పదలుచుకున్న సంగతి మరిచిపోయాను కాని. మనిషైన తరవాత మరిచిపోకుండా ఉంటారేమిటి?"

"అయితే మీతో యెప్పుడు చెబతానంది బాబూ?" వంటలక్క అడిగింది.

"తరవాత చెబతానంది ఇందాకానూ. ఇప్పుడు మరిచిపోయానంటుంది, చూడండి."

"అయితే మరి జ్ఞాపకం తెచ్చుకుని చెబుతుందిలే తరవాత. అంత తొందరపెట్టకు బాబూ." అని, సుందరమ్మాళ్‌తో "ఏంచెప్పాలనుకున్నావో జ్ఞాపకం చేసుకుని చెప్పు అమ్మా?... ఈరాత్రి చెప్పకపోతే రేపు నాతో చెప్పు బాబూ" అంటూ వంటలక్క కూడా నవ్వుతూనే తీర్పుచెప్పింది.

"మీ రెప్పుడూ ఆవిడమాటే ఆడతారు" అన్నాడు వైద్యనాథుడు.

"నువ్వెప్పుడూ పక్షపాతపు మాటలే" అంది సుందరమ్మాళ్.

* * * * *

భోజనాలైనతరవాత పడకగదిలోకి చేరారు, దంపతులిద్దరూను. "మరి ఇందాకటిసంగతి చెప్పు"—మళ్లా ప్రారంభించాడు వైద్యనాథుడు.

"ఇంకా జ్ఞాపకంరాలేదు. ఎంతో ప్రయత్నిస్తున్నాను, మరి ఉండండి. తొందరపెడితే అసలే జ్ఞాపకంరాదు." సుందరమ్మాళ్ వదనము మందహాసశోభితమైనది. కళ్లు భావపూరితములు.

"సరే, అయిదునిముషాల టైము. జ్ఞాపకం చేసుకో." వైద్యనాథుడు గడియారంవేపు చూస్తున్నాడు.

అయిదు నిముషాలూ అయిపోయాయి. సుందరమ్మాళ్ నవ్వుతూనే "ఆసంగతి చెబితేయేమిస్తారు, ముందు చెప్పండి," అంది.

"అసలు విషయం తేలకుండానే బేరంకాబోలు?"

"మీకు మంచి లాభకరమైనసంగతే చెబుతాను. చెప్పండి, ఏమిస్తారోను?"

"నువ్వేది కోరితే అదే."

"అయితే ఉండండి, కొంచెం. మరిచిపోయాను మళ్లీని."

"ఆఁ పెంకిపిల్లా?" అంటూ వైద్యనాథుడు పక్కగనే నిలుచున్న భార్యని తను కూర్చున్న కుర్చీలోకి లాగుకుని తొడలమీద బలవంతంగా కూర్చో పెట్టుకున్నాడు.

"ఉండుదూ, మోటుసరసం! జ్ఞాపకం తెచ్చుకోవాలా మరి? మీ రేమిస్తారో చెప్పరుకాని—"

"నువ్వేదికోరితే అదే."

"సరే జాగ్రత్తగా వినండి మరి."

వైద్యనాథుడు నిశ్శబ్దంగా వింటున్నాడు.

"ఇంకా జాగ్రత్తగా వినాలి. మరి చెప్పనా?"

"నేను వద్దంటున్నానేమిటి?"

"మరి మీరూ-నన్ను-కొంతకాలం వొదిలిపెట్టి ఉండవలసివస్తుంది కొద్దిరోజులలో."

"ఏం?"

"ఎందుచేతో గ్రహించలేరూ?" తీక్ష్ణములై భావపూరితములగు దృష్టులను సుందరమ్మాళ్ భర్తమీద ప్రసరించింది.

"మీఅన్నయ్య పెళ్లికి పుట్టింటికి వెడతావు."

"అయ్యో అమాయకత్వం! మాఅన్నయ్యపెళ్లికి నాతో మీరుకూడా వస్తారుగా" సుందరమ్మాళ్ నవ్వుకుంది కొద్దిగా.

"నాకు తెలియదు మరి. చెబుదూ ఎందుచేతనోను."

"ఆమాత్రం తెలివితేటలుంటే మీరూ స్త్రీలే అయి జన్మించి ఉందురు. సాధారణంగా ఆడదాన్ని భర్త విడిచిపెట్టిఉండవలసిన సమయం ఎప్పుడొస్తుందో యోచించండి, కొంచెం."

"ఎప్పుడా? (కొంచెం ఆలోచించి) గర్భవతిగా ఉన్నప్పుడూ, ఇంట్లోకి రావడానికి వీలులేనప్పుడూ—"

"ఆఁ, ఇంక చాలులెండి. ఇప్పటికి కాస్త దారిలోకి వొచ్చారు. మీరు చెప్పినవాట్లో మొట్టమొదటికారణంవల్లనే అనుకోవచ్చును." సుందరంచెక్కిళ్లు లజ్జారుణిమను ధరించాయి. ఆమె ముఖము కొంచెం పక్కకు తిప్పుకుంది. మందహాసశోభ లామెముఖపద్మమున వికసించాయి.

వైద్యనాథుడు నవ్వుకుంటూ "ఓహో! అదా సంగతి! నువ్వూ, ఆయింట అవిడా కలిసి కుట్రచేసి దాచేశారన్నమాట యిన్నాళ్లూ నాతో చెప్పకుండాను?" అన్నాడు.

"మీ రేమియ్యదలుచుకున్నారో ఇవ్వండి మరీ."

"ఇదుగో తీసుకో" అని వైద్యనాథుడు చలిస్తూవున్న భార్య ఎర్రని పెదిమలను గాఢంగా ముద్దుపెట్టుకున్నాడు.

"బహుమానం లేకపోవడంసరికదా, మోటుసరసంకూడాను" ఆమెముఖము కొంచెం కోపంనటించింది.

"ఎవరు ఎవరికి బహుమాన మియ్యాలో ఆలోచించుకుంటే నీకే తెలుస్తుంది. (కొంచెంనే పూరుకుని) సరేగాని నిన్ను వొదిలిపెట్టవలసిన అవసర మేముంది చెప్పుబాబూ" అని ఆమెముఖాన్ని తనవేపు బాగా తిప్పుకున్నాడు.

"ఇక్కడ ఉద్యోగం మానుకుని నాతో వొచ్చేస్తారేమిటి మాపుట్టింటికి?"

"ఇలాంటి అవసరాలకోసమే సెలవులు ఫట్టాయి."

౪

మరి నాలుగుసెలలు గడిచాయి. సౌరభగర్భితమగు మందమారుతమువలె సుందరమ్మాళ్ సౌందర్యము మనోహరమై ఉండెను. రోజూ కొకరుచొప్పున ఊళ్లో పెద్దపెద్ద గృహస్థులంతా తినుబండారములను కానుకలుగా ఇంజనీరుగారింటికి పంపుతున్నారు. తమ ప్రణయఫలమునుగూర్చి దంపతు లిద్దరూ వెయ్యివిధాల భావికాలగతులను తలపోసుకుంటున్నారు. ఇంక వారంరోజులలో దివానుగారు స్వయంగా వచ్చి కుమార్తెకి సీమంతముజరిగించి ఇంటికి తీసుకెళ్లడానికి నిశ్చయించినట్లు జాబులువచ్చినవి. భార్యతోకూడా వెళ్లాలని వైద్యనాథుడు రెండుసెలలు సెలవుపెట్టుకున్నాడు.

గర్భస్థమగు పవిత్రభారముతోకూడ స్త్రీజనసహజమును, సృష్టికారణమును నగు మాతృభావ మామెయందు వృద్ధిపొందినది. మానవసంఘమహాసౌధనిర్మాణమున కొక యమూల్యచంద్రకాంతశిలాఫలకమును కానుకగా సమర్పింపబోవు సెరదాతవలె గర్భవతియగు తన్ను తా చూచుకొని సుందరమ్మాళ్ గర్వము నందినది.

జీవనము సుమధురమై, ఆనందప్రదమై, అనుభవనీయమై కనబడిం దాయువతీమణికి. విశాలప్రపంచములో ఒకమారుమూలకూడా దుఃఖలేశమునకు తావున్నదని ఆమె కప్పుడు స్ఫురించనైనను లేదు.

భవిష్యత్కాలమంతా మధుమాసప్రభాతమువలె తేజోమయమై, కల్యాణప్రదమై తోచి ఆమె తలపులను వికసింపజేసింది.

శోభాయమానమగు వసంతసమయమున నిరవధికానందపారవశ్యమున మధురగీతములను ఆలాపించే కోకిల రాబోయే భయంకర గ్రీష్మముమాట తలుచుకోనైనా తలుచుకోదు. అల్లా తల్చుకునేటట్లే అయితే ప్రపంచకానికి దాని గానమాధుర్యసంపద శాశ్వతంగా కరువై పోవలసిందేకదా!

*   *   *   *

ఆనాడు ఉదయంనుంచి పదిగంటలవరకూ వంచినతల యెత్తకుండా కచేరీపనిలో మునిగిపోయాడు, వైద్యనాథుడు మామగారు వొచ్చేసరికి తీరుబాటుగా ఉండాలని ఆతనికి భార్యసలహా అందినది. నాటిరాత్రికిగాని, మర్నాటి ఉదయానికిగాని దివానుగారు దిగుతారని ముందే కబురువచ్చింది.

గడియారంలో పదిగంటలు విని సుందరమ్మాళ్ కచేరి సావిట్లోకి వచ్చి "పనిలో బడి మమ్మలిని మరిచిపోతే మరిచిపోయారుగాని భోజనాన్ని కూడా మరిచిపోతారేమిటి? ఇంక అసలే ఇంట్లోకి రారుకాబోలు? బాగానే ఉంది" అని వైద్యనాథుణ్ణి అడిగింది.

ఎంత ఆఫీసుపనిలో ఉన్నా గంటకి రెండుసార్లో మూడుసార్లో ఇంట్లోకి వచ్చి సుందరమ్మాళ్‌తో సరసాలాపాలాడి ఒక మధురమందహాసమో, ఒక గాఢాలింగనమో బహుమానంగా పట్టుకుపోవడ మతనికి మామూలు.

వైద్యనాథుడు తలయెత్తి చూశాడు. ప్రకాశమానములగు కళ్ళజోళ్లలో నుండిపోయి అతని దృష్టులు సహజపాండురతాశోభితమగు సుందరమ్మాళ్ ముఖముపై నిలిచాయి. "ఇదంతా ఏలినవారి ఆజ్ఞప్రకారం జరుగుతూ ఉన్న పనేనా? మీరు చెప్పినట్లు చేసినా కోపమే అయితే మేమెల్లా బతకడం?" అన్నాడు నవ్వుతూను.

"అల్లాఅయితే యింక ముగించెయ్యవలసిందనే మాఆజ్ఞ."

"సరే ఒక్క పావుగంటలో పూర్తి అయిపోతుంది లెండి.—దానికేంగాని సుందరం నువ్వు ఆజ్ఞాపిస్తూన్నప్పుడు మాత్రం నిజంగా మహారాణీలాగే ఉంటావుసుమా! నువ్వేదో మహారాణివై పుట్టవలసింది"

"మీమాటల కెక్కడికి లెద్దురూ. పొద్దు మించిపోయింది. పావుగంట మాత్రమే సుమండీ టైము. వేగిరం భోజనంచేస్తామనుకుని పొద్దుట కాఫీకూడా సరీగా పుచ్చుకున్నారు కారు బాబూ. చంటిపిల్లాడేనా వింటాడుకాని మీరుమాత్రం చెప్పినమాట వినరు." సుందరమ్మాళ్ ముద్దులుగునుస్తూ లోపలికి వెళ్లిపోయింది.

సరీగా పావుగంటే దాటనిచ్చి సుందరమ్మాళ్ మళ్లా వచ్చి "లేవాలిమరి. లెండి." అని తొందర పెట్టింది.

వైద్యనాథుడు ఫౌంటెన్‌పెన్ టేబిలుమీద పెట్టి కళ్లజోడు పెట్లోఉంచి చేతులు వేళ్లు విరుచుకుంటూ "అబ్బా! తల దిమ్మెక్కిపోయింది. మధ్యాహ్నం మరి పనిలేకుండా చేసేసుకున్నాను." అని ఒళ్లు విరుచుకున్నాడు బద్ధకంతో.

"స్నానంచేస్తే తలభారం తగ్గిపోతుంది రండి. నీళ్లు చల్లారిపోతున్నాయి."

"అబ్బా! ఈవేళ యింట్లో స్నానంచెయ్యను. తలదిమ్మ వొదిలేటట్లు గోదావరిలో మునగాలిగాని."

"ఇంత పొద్దెక్కి గోదావరేమిటి? వేణ్ణీళ్లు పోసుకుందురూ. అక్కడ ఈదులాడుతూ ఎంతకీ ఇంటికి రారు."

"అబ్బే! నిముషంలో వొచ్చేస్తాను. నీస్నానమైందా?"

"మీకు నీళ్లూ అవీ అందించి నేను స్నానంజేద్దామనుకుంటున్నాను."

"అల్లా అయితే నువ్వు స్నానంచేసెయ్. అంతలో నేనూ వచ్చేస్తాను."

"ఖాదరుని తీసుకెళ్లండి. తువ్వాలూ, సబ్బూ పట్టుకొస్తాడు."

సుందరంబుజంమీద తట్టుతూ ప్రేమ తొణుకులాడుతూ ఉన్న నేత్రములతో వైద్యనాథుడు "ఖాదరెందుకూ? సబ్బు తేవడానికా? నీట్లో మునిగిపోకుండా నన్ను కాపాడడానికా? వెర్రిపిల్ల! ఎప్పుడూ నే నేమైపోతానో అన్న బెంగే" అన్నాడు.

సబ్బుపెట్టెను పట్టుకుని, భార్య అందించిన తువ్వాలు పైని వేసుకుని వైద్యనాథుడు రమారమీ పదకొండుగంటలప్పుడు గోదావరికి వెళ్లిపోయాడు. వీథిమలుపు తిరిగేవరకూ అతనివేపే చూస్తూ, అతడు దృష్టిపథాన్ని దాటినవెంటనే ఒకనిట్టూర్పు విడిచి సుందరమ్మాళ్ "ఎప్పుడూ చెప్పినమాట వినకపోవడమే" అనుకుంటూ లోపలకు పోయింది.

*   *   *   *

పన్నెండుగంటలు దాటి ఒంటిగంటను సమీపిస్తూంది వేళ. సూర్యుడు నడినెత్తిని సహస్రకిరణాలతో జాజ్వల్యమానుడై ఉన్నాడు. ఆకాశము నిర్మేఘమై ప్రశాంతమై ఉంది. జంతుకోట్లన్నీ వృక్షచ్ఛాయలలో విశ్రమిస్తున్నాయి. వాయుచలనము బహుతక్కువ. చెట్లు ఎండతీక్ష్ణత కోడి తలలు వాల్చేశాయి.

ఆఫీసర్ల లైనులో పుట్టిన హాహాకారములు గ్రామమంతటా నిండిపోయాయి. ఊళ్ళో ఒకడిముఖాన్నీ రక్తపు చుక్క లేదు. ఆబాలగోపాలమూ అత్యాతురతతో గోదావరివేపుకి పరుగులెత్తుతున్నారు. పదకొండుగంటలప్పుడు స్నానాని కెళ్లిన వైద్యనాథయ్యరు ఇంకా ఇంటికి చేరలేదు.

భర్త స్నానానికి వెళ్లినతరవాత గంటసేపుదాకా సుందరమ్మాళ్ కనిపెట్టిచూసింది. అప్పటికీ అతడు రాకపోవడంచేత ఆమె గాభరాపడిపోయి ఖాదరుని పంపించింది.

గోదావరీతీరమంతా నిర్మానుష్యము. ఎక్కడా వైద్యనాథుని జాడలేదు. రేవులో ఉన్న మర్రిచెట్టుకింద అతని తువ్వాలూ, సబ్బుపెట్టెమాత్రము ఖాదరుకి కనిపించాయి. రేవుకి రెండువేపులా ఫర్లాంగు దూరంవరకూ పోయి వెతికాడు. యజమానుడు కనబడకపోవడంచేత వాడి మనస్సు పరిపరివిధాల పోతూంది.

ఇంతలో సమీపాన్నే ఏదో చిన్న అలికిడి వినబడింది. పరధ్యానంగా ఉన్న ఖాదరు ఉలికిపడి నలుదిక్కులా చూశాడు. ఒకయిరుకులో నిలబడి నీళ్లుతాగుతూఉన్న లేడిపిల్ల వాణ్ణిచూసి బెదిరి చర్రున పారిపోయింది.

రేవులో కనబడిన తువ్వాలూ, సబ్బుపెట్టె పట్టుకుని ఖాదరు ఇంటికొచ్చేశాడు. గోదావరివేపు చూస్తూ గుమ్మంలోనే నిలబడి ఉన్న సుందరమ్మాళ్ బంట్రోతు ఒక్కడే రావడం చూసి "అమ్మో" అని అరిచి నేలమీద పడిపోయింది. తన భయమంతా నిజమైపోయిందని ఆమె గ్రహించేసింది. మహాబాధలో ఉన్న పసరములాగు ఆమె హృదయవిదారణంగా మూలుగుతూంది.

బంట్రోతులూ, వంటలక్కా మొదలైనవారందరూ చుట్టూ చేరి భయార్తులై కేకవేశారు. ఖాదరు చెప్పినమాటలు విని అక్కడచేరినవాళ్లంతా గాలాలూ,వలలూ తీసుకొచ్చి గోదావరిలో వెతకడం ప్రారంభించారు. పేరుపొందిన ఈతగాళ్లు నీట్లోమునిగి గాలించేశారు. సాయంకాలం అయిదుగంటలు దాటినతరవాత నీటిఅడుగున బురదలో కూరుకునిపోయిన వైద్యనాథయ్యరుమృతశరీరమును జాలరులు బైటికి తీసి ఒడ్డున పడేశారు.

*   *   *   *

సుందరమ్మాళ్ జీవితపథము భయంకరకంటకావృత మైపోయింది. పట్టపగలే ప్రపంచమంతా అంధకారబంధుర మైపోయినది. కారుమేఘాలు కమ్ముకుని ఆమెజీవితాకాశమున తీవ్రగర్జనలు చేశాయి. నిరాశ విజృంభించి ఆమెయెదుట వికటనృత్యము చేస్తూంది. ఆమెకీ ప్రపంచానికీ ఉన్న సంబంధాలను కాలపురుషుడు దారుణకృపాణముతో ఒక్కత్రుటిలో ఛేదించేశాడు; గిలగిల గింజుకుంటూ ఉన్న ఆమెను చూసి నవ్వుకుంటున్నాడు; ఆమె యేడుస్తూఉన్న రక్తధారలతో నాలుకను తడుపుకుంటున్నాడు. ఇట్టివిషయాలు నిత్యకృత్యము లైపోయినవాని కాఅమాయకురాలి హృదయరోదనము చూస్తేమాత్రం జాలి ఎక్కడిది?

ఆశాసౌధము నేల కూలిపోయినది. మనోహరారణ్యసీమల అమృతోపమములగు లేతపచ్చికదళముల నారగిస్తూ ఉన్న హరిణికి కఠోరబాణఘాతము తగిలినది. సుక్కు తిప్పుకోలేక గిలగిల కొట్టుకుని అలిసిపోయి అది నేలపడిపోయింది.

శ్రీ

తండ్రితో పుట్టినింటికి వెళ్లడానికి సుందరమ్మాళ్ నిరాకరించేసింది. సుఖప్రసవ మగునంతవరకును వలసిన సౌకర్యములు సమకూర్చి దివానుగారు వస్తూపోతూ ఉండేవారు. ఉద్యోగస్థుల భార్యలందరూ వెయ్యికళ్లతో ఆమెను కాపాడుకుంటూఉండేవారు.

భర్త చనిపోయిన రెండుమాసాలకు సుందరమ్మాళ్ మగశిశువును ప్రసవించింది. అప్పుడైనా తండ్రియింటికి పోవడానికామె ఇష్టపడలేదు. కుమారునికే బాధా రాకుండా తల్లి బహుజాగరూకతతో చూస్తూఉండేది.

భర్తతో తాను గడిపిన సౌఖ్యప్రదనాలను తలుచుకొని సుందరమ్మాళ్ సంతతధారగా కన్నీరు కారుస్తూ ఉండేది. అట్టి సుఖజీవన మెన్నటికీ రాదుకదాఅనే నిరాశతో ఆమె వేడినిట్టూర్పులను విడిచేది. ఆమెముఖములో చిరునవ్వే పోయింది. చనిపోయిననాడు వైద్యనాథుడు గౌతమీతీరమునకు పోయినదిక్కు చూస్తూ వసారా స్తంభానికి చేరబడి నాటివలెనే నిలబడి గంటలకొద్దీ నిలబడేది. తిరిగీ భర్త ఆదారినే వస్తాడనికాబోలు లాఅమాయకురాలి అభిప్రాయము!

పిల్లవాడు మూడుమాసములవాడైనాడు. దినదినప్రవర్ధమానుడగు బాలుని చూసుకుని సుందరమ్మాళ్ పొంగిపోతూఉన్న దుఃఖంతో కుమిలిపోయేది. కుమారుని ముఖంలో భర్తప్రతిబింబము స్పష్టంగా కనబడి ఆమెవిషాదమును ద్విగుణీకృతం చేసేసేది. గతించిన ఆనందమయప్రపంచ మామెతలపున నిల్చి హృదయములు చీల్చేసేది. మధురమందహాసపరిశోభితమగు కొడుకుముఖంసహితము ఆమెవిషాదమున కుపశాంతిని కలిగించ లేకపోయేది.

సుందరమ్మాళ్ క్రమంగా క్షీణించిపోయింది. నానాటి కామె శరీరము శల్యావశిష్ట మైపోయినది. ఆమెఆరోగ్యము జననీజనకుల కత్యాతురతను కలిగించింది.

ఈస్థితిలోకూడా ఆమె దుమ్ముగూడెమును విడుచుటకు నిరాకరించేసింది. ఆమెప్రవర్తనకు కారణ మెవ్వరికీ బోధపడలేదు.

శిశువునకైదోమాసము ప్రవేశించి పదిరోజు లయింది. నాటిరాత్రి శుక్లపక్షత్రయోదశీచంద్రుడు వినిర్మలాంబరమున ప్రశస్త కాంతులతో ప్రకాశిస్తున్నాడు. చలి విపరీతంగా వేస్తూంది. ఆఫీసర్లలైనంతా గాఢసుషుప్తిలో మునిగిఉంది. ఒంటిగంట దాటిపోయింది. వాయుసంచలనము బొత్తిగా లేదు. ప్రకృతి అంతా జీవరహిత మైపోయినట్లు నిశ్శబ్దము సర్వత్రా తాండవిస్తూంది.

వైద్యనాథయ్యారు నివసించే బంగాళా దక్షిణవేపు గదితలుపులు మెల్లగా తెరుచుకున్నాయి. ఇంట్లోనించి ఒకవ్యక్తి నెమ్మదిగా నడుస్తూ పూలతోటలో ప్రవేశించింది. ఆపాదమస్తకమూ ధవళవస్త్రాచ్ఛాదితయై ఉంది. ముఖలక్షణాలు గ్రహించడానికేనా అవకాశం లేదు. వెన్నెలతోటలో నిశీథమున నిశ్శబ్ద సమయమున ఏకాకియై సంచరిస్తూఉన్న ఆవ్యక్తి అమానుషమైన భయము గొల్పుతూంది.

ఆవరణగేటును సమీపించిం దావ్యక్తి. నడకనుబట్టి స్త్రీ అని అనుకోవచ్చును. వెనకకి తిరిగి గేటునకు బిగించిఉన్న ఇనపగజాలపై

"...బంగాళావేపు తదేకధ్యానంగా చూస్తూ...నిలబడింది."

శరీరమును అనుకుని బంగాళావేపు తదేకధ్యానంగా చూస్తూ అయిదు నిముషా లట్లే నిలబడింది. శల్యావశిష్టమైన హస్త మొకటి ఇనపగజాలపైని వెన్నెలలో సుద్దపేలికవలె వేలాడుతూంది.

అయిదు నిముషాలు దాటింది. అంతటా భయంకర నిశ్శబ్దము. భూమి ఫాలతలమును సోకేటట్లుగా వంగి శుష్కహస్తములతో నేలను మూడుసార్లు కళ్లకు అద్దుకున్నది. హృదయవిదారకమై దుర్భర బాధాసూచకమైన ఒక నిట్టూర్పు బయలువెడలి తన వేడిమితో ఆవరణమునంతను నింపేసింది.

మళ్లీ గోడ కానుకుని బంగాళావేపు చూస్తూ కొంతసేపు నిలుచుంది ఆవ్యక్తి. ఇంతలో సమీపమందున్న మహావృక్షములనుండి ఒక నక్తంచరపక్షి కర్ణకఠోరముగా కూసింది. ఆఅరవుతో అక్కడి వాతావరణమంతా మారుమ్రోగిపోయింది. ఒక్కసారిగా ఉలికిపడి వెనకకి చూసిం దామె. 'అమ్మా' అని భయంకరవేదనాసూచకమగు హీనస్వరము వినబడింది. తత్క్షణమే గేటుతెరుచుకుని మందగతిని నడుస్తూ ఆవరణ కవతలనున్న నిబిడవృక్షచ్ఛాయలలో బడి అదృశ్యమైపోయిం దావ్యక్తి.

* * * *

సుందరమ్మాళ్ రాత్రి కప్పుకున్న కాశ్మీరశాలువయును, దాని మడతలలో ఉన్న ఒకఉత్తరమూమాత్రము గోదావరీతీరాన్ని రేవులో కనిపించాయి. ఉదయం ఎంతప్రయత్నించినా ఆమెజాడ దొరకలేదు. సాయంకాల మైదుగంటలకిమాత్ర మామెశరీరము గోదావరీనదీ జలములపైని తేలిపోయినది.

నదిఒడ్డున దొరికిన జాబు సుందరమ్మాళ్ తల్లి పేర వ్రాయబడి ఉండెను. మరణోన్ముఖురాలై తన మనోనిశ్చయమునకు గల కారణము నామె ఆజాబులో తల్లికి స్పష్టపరిచినది. ఉత్తరము సుందరమ్మాళ్ స్వదస్తూరీలో ఈక్రిందివిధంగా ఉంది.—

"అమ్మా! నమస్కారములు.

"ఇంక నే నీలోకాన్ని విడిచిపెట్టడానికి ఎంతోవ్యవధి లేదు. ఆఖరుమాటగా కన్నతల్లివైన నీకు నాహృదయాన్ని నివేదించడం నా విధిగా భావించి ఈచిన్నజాబు నీకు రాస్తున్నాను.

"అమ్మా! నీరుణం నే నెల్లా తీర్చుకోగలను! చిన్నప్పటినుంచీ నీఅమృతహస్తాలలో విచారమన్న దేమిటో తెలియకుండా పెరిగాను. ప్రపంచమంతా అంధకారమయమై పోయిన ఈరోజుల్లోకూడా ఆ అమృతహస్తములే నాకు దిక్కైనవి. ఆనీపవిత్రహస్తములకు నమస్కారము లొనరించుటతప్ప ఈస్థితిలో నే చేయగల దేమున్నది? ఎటువంటి భయంకరకష్టములైనా నీప్రేమమయవదనమును చూడగానే కొంతవరకు మరిచిపోయేదాన్ని. ఆముఖాన్ని చూడ్డానికి నాకిదే ఆఖరుసారిఅని అనుకున్నప్పుడల్లా నాహృదయం నీరైపోతూంది.

"మీఅల్లుడు మనలను విడిచిపెట్టిననాడే నే నీనిశ్చయము చేసుకున్నాను. ఎన్నడూ ఒకరినొకరు ఒదిలిపెట్టిఉండకూడదని మాలో మా కొకనియమము ఉన్నది. నావిషయంలో ఆయన ఎన్నడూ ఆడినమాట తప్పలేదు. మానియమభంగము కాకుండా నే నారోజుననే ఆయనతోనే పోవలసిఉండెను. ఇంతకాలమూ నే నిక్కడఉండిపోయినందుకు ఆయనకి నామీద కోపంకూడా వస్తుందని నే నెరుగుదును.

"కాని నాయీకాలహరణానికి తగిన కారణము లేకపోలేదు. ఈసమాధానం చెబితే ఆయనేనా నన్ను క్షమిస్తారనే నా నమ్మకము. గర్భస్థమైన పవిత్రజీవమును ప్రపంచకములోకి తేవలసిన భారము ఒకటి నామీద ఉండెను. భగవంతుని దృష్టిలో ద్రోహినవకుండా

నే నావిధిని త్రోసిపుచ్చలేనని అప్పుడు నేను నిశ్చయించుకున్నాను. మాఇద్దరి నిర్మలప్రేమకు చిహ్నముగా మాప్రతిబింబమగు ఈచిన్న బాలుని ఈలోకంలో విడిచిపెట్టి నే నిప్పుడు నిర్విచారంగా నాకోసము ఆతురతతో నిరీక్షిస్తూఉండే మీఅల్లునిదగ్గరకి పోతున్నాను.

"అమ్మా! అమాయకుడై, నిష్కల్మషమందహాసపరిశోభితుడైన పిల్లవాణ్ణి తలుచుకుంటేమాత్రం నాకడుపు చెరువైపోతుంది. వాడు నవ్వినప్పుడల్లా "అదుగో మాశాంతా? అంతా వైద్యనాథుడి మూడు మూర్తులూనూ" అని నువ్వు నాతో ఎన్నిసార్లో అనేదానివి. అమ్మా! అప్పుడు నాగుండె ఎల్లా కొట్టుకుపోయేదో నీకు తెలియదు. అల్లాంటప్పుడు నాతలచుట్టూ ప్రపంచం యావత్తూ గిర్రున తిరిగిపోతూన్నట్లయేది. హృదయంలో ఎవరో చెయ్యిపెట్టి కలచేస్తున్నట్లు తోచేది.

"గర్భవతినైన సంగతి తెలిసినవెంటనే "పిల్లవాడైతే నాపోలికా, పిల్లఅయితే నీపోలికాను" అనేవారు మీఅల్లుడు. తనపోలికగల పిల్లవాణ్ని ఎత్తుకుని ముద్దులాడుతూ ఉండగా మీఅల్లుణ్ని చూసుకోడానికి నాకళ్లు నోచుకోలేదు.

"నాకు మారుగా మాప్రతిబింబమగు ఈపిల్లవాణ్ని రక్షించమని నేను నిన్ను వేరే ప్రార్థించనక్కరలేదు. కాని స్త్రీజన సహజమగు పుత్రప్రేమచేత నాఅంత్య ప్రార్థనగా ఈశిశువును పోషించమని నిన్ను మరీమరీ వేడుకుంటున్నాను. వాణ్ణి తలుచుకున్నకొద్దీ నాకు మతిపోతుంది. నానిశ్చయము పట్టుసడలిపోతుంది. మానియమభంగమైపోతుందనే భయం కలుగుతో ఉంటుంది. కనుక ఇంక నామనస్సును కట్టిపెట్టేసుకుని ఆవిషయం వదిలిపెట్టేస్తున్నాను. అమ్మా! అమ్మా! కడుపులో ఏదో మంట...

"అమ్మా! నాభర్తను చేరుకోవాలనే స్వార్థపరత్వబుద్ధిచేత నీకు దుఃఖం కలిగిస్తున్నాను. నిర్భాగ్యురాలను, నీకడుపున పుట్టి నిన్ను సుఖపెట్టలేకపోవడం సరికదా గర్భశోకముకూడా నీకు తెచ్చిపెడుతున్నాను. అశ్రుధారాపూరితమై, దుర్భర పుత్రికా శోకదంహ్యమానమైన నీమ్లానవదనము ఇప్పుడే నాదృష్టియెదుట తోచి నాబాధను ఇనుమడింప చేస్తూంది. అమ్మా! క్షమించు. పాపాత్మురాలను, క్షమించు - నన్ను మరిచిపో. అదుగో గౌతమీమహానది సహస్రహస్తాలతో నన్ను ఆహ్వానిస్తూంది.

"తల్లీ! గౌతమీ! యశోవిభ్రాజితములగు మహాసామ్రాజ్యములు లెక్కలేనన్ని నీపవిత్రగర్భమున లీనమైపోయాయి. దిగంత విశ్రాంతకీర్తులగు చక్రవర్తులు, ప్రఖ్యాతరాజనీతివిశారదులగు మంత్రిసత్తములు, అసమానప్రజ్ఞానిధులగు కవీంద్రులు, అతిరథ మహారథులగు వీరోత్తంసులు నీతీరమందు దుష్కవిల్లి నీయందే అంతరించారు. నీపుణ్యతరంగము లనుక్షణమును ముక్తకంఠములతో వారి నిర్మలకీర్తిని గానముచేస్తూఉంటాయి. అందుచేత నేనుకూడా నీపాదారవిందములనే శరణముకోరుకొన్నాను. నీయందు ప్రాణములను కోలుపోయిన ధన్యుల కందరాని స్వర్గసౌఖ్యములు లేవని శ్రుతిస్మృతులు ఘోషిస్తున్నాయి.

"జననీ! గౌతమీ! మందభాగ్యురాలను. నాకు నీచల్లని కడుపులో ఒక్కింత తావిచ్చి రక్షించు. నీదివ్యతరంగహస్తములతో నన్ను నాభర్తను చేర్చుమని హస్తములు మోడ్చి ప్రార్థిస్తున్నాను. అనుగ్రహించు.

"అమ్మా! ఇంక మీసంగతి ఆలోచించుకున్నకొద్దీ దుఃఖం పొర్లిపోతూవస్తుంది. నన్ను తలుచుకుని ఎంతఏడుస్తావోకదా అని నాహృదయము ఉడుకెత్తిపోతూంది. నాగురించి ఏడవకు. అంధకారభరితమైపోయిన యీలోకాన్ని విడిచి వేరొకలోకంలో నీకుమార్తె సౌఖ్యముపొందుతుం దనుకుని ఊరడిల్లి ఉండమని నా అంత్యప్రార్థన. నన్ను ముమ్మాటికీ క్షమిస్తావనే నమ్ముతున్నాను. సెలవు. ద్రోహిని. క్షమించు...

"విధేయురాలు

"సుందరమ్మాళ్."

*   *   *   *

ఉద్యోగనిర్వహణార్థము తమ గ్రామానికి వచ్చి, అందరికినీ గౌరవనీయులై మెలగి, అతిపవిత్రప్రణయసూత్రనిబద్ధులై తాము చూస్తూండగానే, తమకళ్లయెదుటనే అంతరించిపోయిన ఆపుణ్యదంపతులను దుమ్ముగూడెమునివాసులు నేటికీ సంస్మరించుకుని ధన్యులౌతూఉంటారు. గ్రామస్థులును, ఆఫీసర్లును కలిసి ఆయువతీయువకుల గౌరవార్థము గోదావరీతీరమున ఒకచలువరాతిమంటపమును నిర్మించి కృతార్థులైనారు.

సర్వకాలసర్వావస్థలయందును గౌతమీవినిర్మలతరంగమాలికలు ఆమంటపమును ప్రేమతో ముద్దులాడుతూఉంటాయి. స్ఫటికశిలావినిర్మితమై, చిన్నదైనను సుందరమై మార్గస్థుల భక్తిగౌరవములకు గురియై ఆమంటపము నేటికీ అక్కడ నిల్చిఉన్నది.